క్లుప్తంగా

పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని చెప్పారు. దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుడదని సూచించారు. మున్సిపల్ సిబ్బందికి ప్రతిరోజూ చెత్తను అందించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు.

పంచాయతీ డంపింగ్ యార్డు ఆక్రమణ



పంచాయతీ డంపింగ్‌యార్డు స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదమామిడిపల్లిలో శ్మశానికి ఆనుకుని పంచాయతీ డంపింగ్‌యార్డుగా వినియోగించుకుంటున్న స్థలాన్ని స్థానిక ఎస్సీ సంఘం ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసింది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి తహసీల్దార్, ఇతర మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సూచనల మేరకు పంచాయతీ అధికారులు ఆ గ్రామ ఎస్సీ సంఘానికి నోటీసులు జారీ చేయనున్నారు. గతంలో ఈ స్థలంలో చిన్నపిల్లలను సమాధి చేసేవారని, ప్రస్తుతం పంచాయతీ డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నట్లు గ్రామ ఉప సర్పంచ్ యాండ్ర గోపి తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఎస్సీ సంఘానికి పంచాయతీ స్థలం ఉందని చెప్పారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 17 మంది ఎంపిక



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ కనకారావు

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో గురువారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హెట్రోడ్రగ్స్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ సంస్థల హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు జరిపారు. ఇంటర్వ్యూలకు మొత్తం 43 మంది హాజరుకాగా, 17 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు చెప్పారు. ముత్తూట్ కంపెనీకి 14 మంది, హెట్రో డ్రగ్స్‌కు ముగ్గురు ఎంపికయ్యారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచిమంచి ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రమేష్, కళాశాల డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



యాళ్లవానిగరువులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వినియోగదారులు తాము కొన్న వస్తువులపై నాణ్యత, విలువలు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి కోరారు. ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం యాళ్లవానిగరువులో వినియోగదారులు హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కన్స్యూమర్స్ క్లబ్, వాణిజ్య విభాగం ఇన్‌చార్జ్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ పీఓలు ఎం.రామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంతాలను పరిరక్షించుకోవాలి

పాలకొల్లు అర్బన్: దంతాలను పరిరక్షించుకోవడంలో చిన్న చిన్న చిట్కాలను పాటించాలని ప్రముఖ దంత వైద్య నిపుణురాలు సంగినీడి జ్యోతి అన్నారు. యునైటెడ్ కాపు వనిత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అచ్చుగట్లపాలెం శ్రీ ముఖదారమ్మ ఆలయ ఆవరణలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దంత పరీక్షలు నిర్వహించారు. అలాగే సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ సౌజన్యంతో సుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ జ్యోతిని క్లబ్ తరపున ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.

మరమ్మతుల్లో నాణ్యతా లోపాలు

- రోడ్ల మరమ్మతుల్లో కనిపించని తారు
- గప్‌చుప్‌గా ఉంటున్న అధికారులు, నాయకులు



బ్రాడీపేట బైపాస్‌లో తారు శాతం లేకుండా మరమ్మతులు చేసిన రోడ్డు

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారాయి.. సంకాంత్రి నాటికి వేగంగా రోడ్లను మరమ్మతులు చేస్తామని స్థానిక మంత్రి ఆర్భాటంగా ప్రకటించారు. నిధులు మంజూరయ్యాయంటూ పలు రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఈ రోడ్ల మరమ్మతుల్లో మాత్రం నాణ్యత ప్రమాణాలు కనిపించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నరసాపురం పాలకొల్లు, పాలకొల్లు పూలపల్లి బైపాస్, బ్రాడీపేట బైపాస్, పెనుమదం రోడ్డు, పాలకొల్లు దొడ్డిపట్ల ఇలా నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేస్తున్నారు. ఇలా మరమ్మతు చేసిన రోడ్లలో కొన్ని ప్రాంతాల్లో తారు శాతం అంతగా కనిపించడంలేదు. చాలా చోట్ల నాణ్యత లేకుండా రోడ్లు మరమ్మతులు చేస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా బ్రాడీపేట బైపాస్ రోడ్డులో 11 ఎంఎం సైజ్ మెటల్ వాడడంతో వేయడంతో తారు లేక ఖాళీగా కనిపిస్తుంది. అలాగే పెనుమదం రోడ్డు మరమ్మతుల్లో కూడా ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ప్రజలు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రోడ్డు షరా మామూలుగానే గుంటలు పడిపోతుందని వాహనదారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. మరమ్మతులైనా నాణ్యంగా చేస్తే కొద్దిరోజులైనా రోడ్లు పాడవకుండా ఉంటాయని వాహనదారులు సూచిస్తున్నారు.

మరమ్మతులు చేసే రోడ్లు ఇవీ

ప్రస్తుతం నియోజకవర్గంలో పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డు రూ.15 లక్షలు, పెనుమదం రూ. 20 లక్షలు, దొడ్డిపట్ల రోడ్డు రూ. 30 లక్షలు, సాయి చిత్రాలయం రోడ్డు రూ. 50 లక్షలు, శివదేవుని చిక్కాల రోడ్డు రూ. 70 లక్షలు, గంగడపాలెం రోడ్డు రూ. 10 లక్షలు, పట్టణంలో దేశాలమ్మ గుడి రోడ్డు రూ. 17 లక్షలు, పూలపల్లి ఆగర్తిపాలెం రోడ్డు రూ. 17 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు.

తప్పును తప్పు అంటే మంత్రికి కోపం

ఇటీవల మంత్రి స్వగ్రామం వెళ్లే మార్గంలో రోడ్డు అధ్వాన్నంగా ఉందని సాక్షి దినపత్రికలో కథనం రాసినందుకు ఓ సమావేశంలో సాక్షి విలేకర్లపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. రూ.1500లకు వార్తలు రాసుకోవడానికి అలవాటు పడి ఇలాంటి వార్తలు రాస్తుంటారని అవమానకరంగా మాట్లాడారు. ఆ మరుసటి రోజునే వారి అనుకూల పత్రికల్లో కూడా రోడ్లు అధ్వానం అంటూ వార్తలు రావడం గమనార్హం.

కాంట్రాక్టర్ వాడే మెటల్ వల్లే..



నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్లను మరమ్మతులు చేస్తున్నాం. రోడ్లు నాణ్యతతోనే చేస్తున్నారు. మరమ్మతులు చేయడానికి 9 లేక 11 ఎంఎం చిప్స్ వాడతాం. 9 ఎంఎం సైజ్ మెటల్ దొరకకపోవడంతో కాంట్రాక్టర్లు 11 ఎంఎం చిప్స్ వాడుతున్నారు. అందువల్ల రాళ్ల మధ్య ఖాళీ ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది తప్ప నాణ్యతా లోపం కాదు. సంక్రాంతి పండుగ నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తాం.

– మూర్తి, ఏఈఈ,ఆర్అండ్‌బీ, పాలకొల్లు

నేటి నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

నరసాపురం: ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలను శుక్రవారం నుంచి వచ్చేనెల 19 వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం డిపో పరిధిలో ప్రస్తుతం పాలకొల్లు పట్టణంలో డోర్ డెలివరీ అమలవుతుందని చెప్పారు. త్వరతో నరసాపురంలో కూడా ఈ సదుపాయాన్ని అమలు చేయబోతున్నామని చెప్పారు. 1 కిలో నుంచి 50 కిలోల వరకూ సరుకులను డోర్ డెలివరీ చేస్తామన్నారు. దీనిపై ఈ మాసోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



చిన్నం రామిరెడ్డి



కర్రి భోగేశ్వరరెడ్డి



బుడితి సుమన్



బందన పూర్ణచంద్రరావు

పెనుమంట్ర: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా ఆచంట నియోజకవర్గానికి చెందిన ముగ్గురిని నియమించినట్లు జిల్లా కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రైతుల విభాగం అధ్యక్షుడిగా పెనుగొండ మండలం చిన్నంవారిపాలెం గ్రామానికి చెందిన చిన్నంరామిరెడ్డి, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన కర్రి భోగేశ్వరరెడ్డి, వీవర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆచంట మండలం వేమవరానికి చెందిన అందే నాగబసవన్నను నియమించారు.

నరసాపురంలో..

నరసాపురం: నరసాపురం నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నియమించారు. ఐటీ విభాగం అధ్యక్షుడిగా బుడితి సుమన్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా బందన పూర్ణ చంద్రరావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా బిల్లు వీర వెంకట సత్యనారాయణమూర్తిలను నియమించారు. కొత్తగా నియమితులైన నేతలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు అభినందించారు.

వైఎస్సార్ సీపీకి యువత అండగా నిలవాలి



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో కుంచిలపల్లి వినిస్టన్‌బాబు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చినమిల్లి చంద్రశేఖర్

పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను ఏ విధంగా విస్మరించి వారిని మోసం చేసిందో ప్రజలకు వివరించడంలో యువత భాగస్వాములను చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు గురువారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిసిన సందర్భంగా పలు సూచనలు చేసినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో యువత ఎక్కువమందిని పాల్గొనేలా చూడాలని కోరారన్నారు.

భవిష్యత్ మనదే

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీలో అంకిత బావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తగిన గుర్తింపును ఇస్తామని, భవిష్యత్తు మనదేనని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని పార్టీ మండల శాఖ యువజన విభాగం అధ్యక్షుడు చినమిల్లి చంద్ర శేఖర్ అన్నారు. గురువారం తాడేపల్లిలోని కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుతో కలిశామన్నారు. జగన్ సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా నరసాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని చినమిల్లి చంద్రశేఖర్ (చందు) స్పష్టం చేశారు.

పోడూరులో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి

పోడూరు: గ్రామీణ ప్రాంతాల్లో పేద రోగులకు తగిన వైద్య సేవలు అందించడానికి లయన్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని రీజియన్ చైర్మన్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి అన్నారు. పోడూరులోని శ్రీ హారిక ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రీజియన్ చైర్మన్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రోగులకు లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. శిబిరంలో సాధారణ రోగులతో పాటు, కంటి, దంత ఆరోగ్య సమస్యలు, చెవి ,ముక్కు, గొంతు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఆయా విభాగాల వారీగా పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు ఆరిమిల్లి పద్మజ, హేమంత్ మాధుర్, బొబ్బా కమలేష్, జి.శ్యామ్ వివేక్, పి.కృష్ణమూర్తి, సంతోష్ కుమార్, స్పందన, శ్రీహర్ష తదితరులు రోగులకు సేవలందించారు.

వర్షాలతో తడిచిన ధాన్యం



తడిచిన ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్న కూలీలు

యలమంచిలి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చివరకు వచ్చేసరికి వర్షార్పణమవుతుందని రైతులు వాపోతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంతమంది రైతులను నిండా ముంచాయి. గుంపర్రు, పెనుమర్రు, మేడపాడు, చింతదిబ్బ, కాంభొట్లపాలెం గ్రామాలలో వర్షాలకు కోసిన చేలోని వరి పనులు తడిచిపోయాయి. మరి కొన్ని గ్రామాలలో నూర్చిన ధాన్యంపై బరకాలు కప్పినా కూడా ధాన్యం తడిచిపోయింది. ముఖ్యంగా మబ్బులతో కూడిన చిరు జల్లులు వల్ల వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో రైతులు ఆ ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచారు. ఆ ధాన్యం ముక్కుపోతుందని రైతులు వాపోతున్నారు.

ఘనంగా హనుమద్ వ్రతాలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మార్గశిర మాసంలో ఈ ఆలయంలో తొమ్మిది రోజులపాటు ఈ వ్రతాలు చేస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు యేడిద ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో జరిగే ఈ వ్రతాల్లో రోజుకొక దంపతుల జంట పీటలపై కూర్చొని ఈ వ్రతం నిర్వహిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ఈ క్రతువులో పాల్గొంటున్నారు. వ్రతం అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాద వితరణ చేస్తున్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య సూచించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాసవర్మ, నిమ్మల రామానాయుడులను గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. పాలకొల్లులో ఇప్పటికే 100 పడకల ఆస్పత్రి త్వరలోనే నిర్మాణ దశ పూర్తిచేసుకోనుందని తెలిపారు. ఈ వనరులను ఉపయోగించి ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేయాలని పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం అతి సామాన్య ప్రజలు కూడా హైదరాబాద్, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలంటే ఆరోగ్యశ్రీతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రతి జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

మహిళలను వేధిస్తే చట్టపరంగా చర్యలు



చింతపర్రులో లింగ వివక్షపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మహిళలను వేధించినా లేదా వారిపై వివక్ష చూపించినా చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు చెప్పారు. రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చింతపర్రులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్ల, మగపిల్లవాడు అనే వివక్ష చూపించకుండా ఇద్దరూ సమానమే అన్న భావంతో పెంచాలని సూచించారు. అలాగే మహిళలకు నిర్దేశించిన చట్టాలను, బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అరుణకుమారి, ఎంఎంఎల్‌టీ మురళీ కృష్ణ, కృపావతి, పద్మావతి, భాను, ప్రవల్లిక, నవీన్, నాగరాజు, ఐసీఆర్‌పీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పాలకొల్లు అర్బన్: యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరీయల్‌ను బాగా చదువుకుని పదో తరగతిలో ప్రతి పాఠ్యాంశంలోనూ మంచి మార్కులు సాధించాలని డాక్టర్ సబిత జూనియర్ కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఎంఎస్ వాసు చెప్పారు. పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ బాలికల హైస్కూల్‌లో గురువారం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్, డాక్టర్ సబిత జూనియర్ కళాశాల సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి పవన్, వేరుకొండ దుర్గాప్రసాద్, రావాడ సతీష్, కానూరి ప్రభాకర్, సత్తినీడి రాజా పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి బెన్నీబాబును అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: స్థానిక స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం ఈసీఈ చదువుతున్న జి.బెన్నీబాబు రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో ద్వితీయస్థానం సాధించాడు. ఇటీవల హైదరాబాద్‌లోని విజ్ఞానజ్యోతి యూనివర్సిటీ నిర్వహించిన మిలాన్–2024 రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పాల్గొని బహుమతి సాధించాడు. అలాగే బీటెక్ కోర్సు పూర్తి అయిన అనంతరం విజ్ఞానజ్యోతి యూనివర్సిటీలోనే ఫొటోగ్రఫీ అధ్యాపకుడిగా ఏడాదికి రూ.6 లక్షల వార్షిక పారితోషికంతో ఉద్యోగం పొందారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉద్యోగ అవకాశం దక్కించుకున్న బెన్నీబాబును కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, గోపిచంద్, ఇసిఇ హెచ్‌ఓడీ డాక్టర్ బీఎస్ రావు తదితరులు అభినందించారు.

చినగోపురంలో ధనుర్మాస పూజలు



శ్రీమన్నారాయణుడికి ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా గురువారం నాలుగో రోజు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం రేపాక సుధారాణితో వీణాగానం, అనంతరం పాశుర విన్నపం , మాల, పూల జడలతో ప్రత్యేక అలంకరణ, టీటీడీ వారి ఆళ్వార్ దివ్య ప్రబంద ప్రాజెక్ట్ వారితో నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. నాలుగో రోజు స్వామివారి పూజ నిమిత్తం పూలు, ప్రసాదం దాతలు మాచేపల్లి వెంకట రత్న ప్రభాకరరావు, బొండ మురళీగంగాధర్ రామనాగ కిషోర్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బిరుదుకోట శంకర్ పాల్గొన్నారు.

పాలకొల్లు సెంట్రల్

రెవెన్యూ సదస్సులతో భూ వివాదాల పరిష్కారం



నరసాపురం రూరల్: సారవ గ్రామంలో రైతుల సమస్యలు వింటున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: భూ సంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందించే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. నరసాపురం మండలంలోని సారవ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ అధికారులే మీ గ్రామానికి వచ్చి సమస్యలపై అర్జీలు తీసుకుంటున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం యర్రంశెట్టివారిపాలెం గ్రామంలో జరిగిన సభలో 47, సారవ గ్రామంలో 25 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తలారి రాజ రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీ నారాయణ, వీఆర్వోలు భారతి, చిరంజీవి పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: భూసమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు రైతులు ఒక వేదికగా సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. గురువారం ఆలమూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలమూరు దళిత శ్మశాన వాటికపై వస్తున్న ఫిర్యాదులపై స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రస్తుత స్థలంలోనే తాత్కాలిక ఫెన్సింగ్ వేసుకుని రైతులు బల్రెలను నిర్వహించుకోవాలని అందుకు తగిన ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 14 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు నీటి సంఘ అధ్యక్షుడు తేతలి వెంకట రామారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎలియమ్మ, వీఆర్వో ఖండవల్లి రాజు పాల్గొన్నారు.

ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు డీ క్లాస్ పట్టాలు

యలమంచిలి: లక్ష్మీపాలెం గ్రామంలో ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు గతంలో ఇచ్చిన సీ క్లాస్ పట్టా భూములకు డీ క్లాస్ పట్టాలు మంజూరు చేయాలని సొసైటీ సభ్యులు కోరారు. మీ భూమి మీ హక్కు నినాదంతో గురువారం ఉదయం లక్ష్మీపాలెం, మధ్యాహ్నం కట్టుపాలెం గ్రామాలలో గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. లక్ష్మీపాలెం గ్రామంలో చాలా ఏళ్లుగా ఈ సీ క్లాస్ పట్టా భూములు సాగు చేసుకుంటున్నామని ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులు చెప్పారు. అయితే సాగు రుణం కోసం బ్యాంకులకు వెళితే సీ క్లాస్ పట్టా భూములకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. కుటుంబ అవసరాల కోసం భూమి అమ్ముకోవాలన్నా రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. అలాగే లక్ష్మీపాలెం, రాజోలు గ్రామాల సరిహద్దు వివాదాన్ని కూడా పరిష్కరించాలని కోరారు. దీంతో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ ఫీల్డ్ విజిట్ చేసి సరిహద్దును పరిశీలించారు. లక్ష్మీపాలెంలో 17 దరఖాస్తులు, కట్టుపాలెంలో 14 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపాలెం, కట్టుపాలెం గ్రామ సర్పంచ్‌లు గటిగంటి మహేష్, పొన్నమండ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్, ఆర్ఐ యశోద పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా తమ భూములకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని పోడూరు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. పోడూరు గ్రామ పంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో స్థానిక తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులతో రైతుల భూములకు సంబంధించిన సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని తెలిపారు. సదస్సులో రైతుల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం 19 దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు (చిన బాబు), సర్పంచ్ శెట్టి బత్తుల సువర్ణ రాజు, ఉప సర్పంచ్ ఎస్. జయ రామకృష్ణ, స్థానిక నాయకులు రుద్రరాజు రమేష్ రాజు, రుద్రరాజు వరహాల రాజు తదితరులు పాల్గొన్నారు.